సాక్షి
నిజామాబాద్

బుధవారం, 15, నవంబర్, 2023



రికార్డులు పక్కాగా ఉండాలి

జీపీ రికార్డులు పక్కాగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. నడిపల్లి జీపీని మంగళవారం తనిఖీ చేశారు.

- 10లో ▸



ఎన్నికల పాఠం..

పదోతరగతి సాంఘికశాస్త్రంలో ఎన్నికల సరళిపై పాఠ్యాంశాన్ని పొందుపర్చారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5 /19.3

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ శివారులో బుధవారం నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు నిఘా ఏర్పాటు చేశామని సీపీ కల్మేశ్వర్ అన్నారు. మంగళవారం పట్టణ శివారులో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభ స్థలంతో పాటు హెలీప్యాడ్ ల్యాండింగ్ స్థలాన్ని పరిశీలించారు. సభాస్థలి వద్ద పార్కింగ్ స్థలం ఎక్కడ ఏర్పాటు చేశారని, ప్రజలు సభలోకి వచ్చే ఎంట్రన్స్ వివరాలతో పాటు వీఐపీ గ్యాలరీ గురించి ఏసీపీ కిరణ్‌కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. నిజామాబాద్ వచ్చే బస్సులు మోస్రా మీదుగా బోధన్‌కు మళ్లించాలని అధికారులకు సూచించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్ బృందం హెలీప్యాడ్ ల్యాండింగ్, సభాస్థలాన్ని పరిశీలించారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ జయరాజ్, సీఐ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

6న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్‌నాగారం : జిల్లా ప్రజాపరిషత్ సాధరణ సర్వసభ్య సమావేశం డిసెంబర్ 6న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆయా శాఖల అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరు కావాలన్నారు.

కేసీఆర్ పాలనను అంతమొందిస్తాం



ఖలీల్‌వాడి : కేసీఆర్ పాలనను అంతమొందించడానికి అన్ని శక్తులు ఏకమై గద్దె దించేవరకు మా పోరాటం సాగుతూనే ఉంటుందని తెలంగాణ జనసమితి పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో తెలంగాణ జన సమితి పార్టీ నుంచి నామినేషన్ వేసిన జాఫర్ ఉపసంహరించుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షబ్బీర్ అలీకి పూర్తిస్థాయిగా మద్దతు తెలిపారు. బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణ చేసి యువతను తాగుబోతు చేస్తున్నారన్నారు. రూ.5 లక్షల కోట్ల అప్పులు తప్ప తెలంగాణలో కొత్తగా ఒరిగింది ఏమీ లేదన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజీ కట్టి కమిషన్లు కక్కుర్తి పడి నాసిరకంగా కట్టడంతో కూలిపోతుందన్నారు. టీజేఎస్ అభ్యర్థి జాఫర్ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

సహకార సంఘాల పాత్ర కీలకం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్ : దేశాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న సమావేశ మందిరంలో సహకారశాఖ ఆధ్వర్యంలో 70వ జాతీయ సహకార వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సంబంధించి అన్ని అవసరాలు తీర్చడంలో సహకార సంఘాలు ప్రముఖ పాత్ర పోషించాయన్నారు. సహకార సంఘాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సహకార సిబ్బంది, రైతులు కృషి చేయాలని సూచించారు. రైతాంగం కూడా సంఘాల సేవలను సద్వినియోగపర్చుకుని వాటి అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకుని రాజకీయపరమైన కార్యక్రమాలు నిర్వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీసీఓ సింహాచలం, సహకార సంఘ సీఈఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫరీదుపేటలో బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



మాచారెడ్డిలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన షబ్బీర్ అలీ



కార్నర్ మీటింగ్‌లతో కాంగ్రెస్‌లో జోష్

- ఒకేరోజు ఐదుచోట్ల సమావేశాలు
- కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా పీసీసీ చీఫ్ విమర్శలు

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం కామారెడ్డి నియోజకవర్గంలో పర్యటించారు. ఐదు చోట్ల కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌పై పదునైన విమర్శలు గుప్పించి పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచారు.

సాక్షి, కామారెడ్డి/రామారెడ్డి/మాచారెడ్డి: కామారెడ్డినుంచి పోటీ చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం 5 గంటలకు వరంగల్ జిల్లా నుంచి హెలీకాప్టర్ ద్వారా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ, నేతలు అద్దంకి దయాకర్, అరికెల నర్సారెడ్డి, యూసుఫ్ అలీ తదితరులతో కలిసి రామారెడ్డి మండలం రెడ్డిపేటకు వెళ్లారు. వందలాది మంది మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడ కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మీద, ఆయన కుటుంబం మీద విమర్శలు గుప్పించారు. గజ్వేల్‌లో భూములను కొల్లగొట్టి కామారెడ్డి భూముల మీదకు వస్తుంద్రంటూ ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని రాజకీయంగా బొంద పెట్టి వాళ్ల నుంచి రైతుల భూములను కాపాడతానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టగానే తాను మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇసాయిపేటలో..

రెడ్డిపేట నుంచి అన్నారం మీదుగా మాచారెడ్డి మండలంలోని ఇసాయిపేట గ్రామానికి చేరుకుని కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలను గురించి వివరించారు. బీఆర్‌ఎస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుందని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ యువత ఆకాంక్షల మేరకు సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే.. అధికారం చేపట్టిన కేసీఆర్ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, తన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు ఇచ్చుకున్నాడని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్ కుటుంబం ఉద్యోగాలు ఊడాల్సిందేనన్నారు.

చుక్కాపూర్, మాచారెడ్డిలలో..

ఫరీదుపేట సమావేశాన్ని ముగించుకున్న రేవంత్‌రెడ్డి అక్కడినుంచి మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చేరుకున్నారు. ఆయన సమక్షంలో గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు రూప కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. చుక్కాపూర్ తర్వాత షబ్బీర్‌అలీ సొంత గ్రామమైన మాచారెడ్డి మండల కేంద్రంలో జరిగిన సభలో మాట్లాడారు. కేసీఆర్‌ను ఓడించేందుకు వచ్చిన తనకు అండగా నిలవాలని కోరారు. అనంతరం రేవంత్‌రెడ్డి బీబీపేట మండలం జనగామ గ్రామంలోని తిమ్మయ్యగారి వేణుగోపాల్ రెడ్డి ఇంటికివెళ్లారు. అక్కడే భోజనం చేసి, కామారెడ్డికి వెళ్లారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఇంట్లో రాత్రి బస చేశారు.



ఇసాయిపేటలో ఓటర్లకు నమస్కరిస్తూ..

ఫరీదుపేటలో..

ఇసాయిపేట నుంచి పాల్వంచ మండలంలోని ఫరీదుపేటకు చేరుకున్న పీసీసీ చీఫ్‌కు గ్రామస్తులు స్వాగతం పలికారు. క్రేన్ సాయంతో గజమాలను వేశారు. వందలాది మంది జనం జమకూడగా రేవంత్‌రెడ్డి ఆవేశంగా ప్రసంగించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల జీవితాలు ఆగమయ్యాయని, ఇపుడు కేసీఆర్ కామారెడ్డికి వస్తే ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని కష్టాలు తప్పవని పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఓడించాలన్న ఉద్దేశంతో సోనియాగాంధీ, ఖర్గే, రాహుల్ గాంధీ తనను కామారెడ్డికి పంపించారన్నారు. ఈ సందర్భంగా బందరామేశ్వర్‌పల్లి గ్రామ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరారు.



ఫరీద్‌పేటలో గజమాలతో సత్కారం

నాలుగు గంటల్లో..

కామారెడ్డి నుంచి రోడ్డు మార్గాన రెడ్డిపేటకు సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చేరుకున్న రేవంత్‌రెడ్డికి అక్కడి మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. అక్కడ సభ ముగియగానే ఇసాయిపేటకు వెళ్లి, సభకు హాజరైన మహిళలతో ముచ్చటించారు. యువతతో కరచాలనం చేశారు. సభలో మాట్లాడిన అనంతరం ఫరీదుపేటకు వెళ్లి, కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. అక్కడి నుంచి చుక్కాపూర్‌లో జరిగిన సభకు వెళ్లారు. చివరి సభ మాచారెడ్డి మండల కేంద్రంలో జరిగింది. అక్కడ అరగంట పాటు ప్రసంగించారు. నాలుగు గంటల్లో ఐదు సభలు పూర్తి చేశారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు నారెడ్డి మోహన్‌రెడ్డి, నాయకులు గణేశ్‌నాయక్, చంద్రకాంత్ రెడ్డి, భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, బ్రహ్మానందరెడ్డి, కిట్టు, నౌసీలాల్, ధన్‌సింగ్, కుమ్మరి శంకర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుబులు రేపుతున్న గోర్త రాజేందర్

- బీసీ వాదనతో బరిలో ఉండనున్నారనే చర్చ
- ఆర్మూర్‌లో కాంగ్రెస్‌కు తిరుగుబాటు అభ్యర్థి కానున్నారా..
- స్వతంత్ర అభ్యర్థిగా ఫోర్స్‌లో ఉన్న నామినేషన్
- మున్నూరుకాపు సామాజికవర్గం కలిసొస్తుందనే అంచనా
- ఇప్పటికే బీసీ సంఘాలు, ఆర్ కృష్ణయ్యతో టచ్‌లో..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆర్మూర్ నియోజకవర్గంలో గోర్త రాజేందర్ గుబులు రేపుతున్నారు. పార్టీ టికెట్టు కోసం ఢిల్లీ స్థాయిలో తుది వరకు గట్టిగా ప్రయత్నాలు చేసి విఫలమైన రాజేందర్ కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పేరిట దాఖలు చేసిన నామినేషన్ మంగళవారం తిరస్కరణకు గురికాగా స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న నామినేషన్ ఫోర్స్‌లో ఉంది. ఉపసంహరణకు బుధవారం ఆఖరుతేదీ కావడంతో శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. కాగా ఇప్పటికే కాంగ్రెస్ టికెట్టుతో బరిలో ఉన్న వినయ్‌రెడ్డి తమను కలుపుకుపోవడం లేదనే అసంతృప్తిని కొందరు నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజేందర్ అంశం మరింత అలజడి కలిగిస్తోంది. రాజేందర్ బీసీ వాదనతో బరిలో ఉంటారా అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా వినిపిస్తోంది.

బీసీలకు దక్కని కాంగ్రెస్ టికెట్టు

కాంగ్రెస్ పార్టీలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రెండు నుంచి మూడు సీట్లు బీసీలకు కేటాయించాలనే డిమాండ్ నడిచింది. అయితే నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ స్థానాలను బీసీలకు కేటాయిస్తారని పార్టీ వర్గాలు ముందునుంచే చెబుతూ వచ్చాయి. అనూహ్య పరిణామాల నేపథ్యంలో బీసీలకు ఒక్క సీటూ దక్కలేదు. నిజామాబాద్ అర్బన్‌తో పాటు ఆర్మూర్ సీట్లు బీసీలకు వచ్చినట్లే వచ్చి చివరి నిముషంలో చేజారాయి. బలమైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన గోర్త రాజేందర్ ఇప్పటికే ఆర్ కృష్ణయ్యను కలిసి టచ్‌లో ఉంటూ వస్తున్నారు. అదేవిధంగా బీసీ సంఘాలతో మంతనాలు జరుపుతూ వస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు మున్నూరుకాపు సామాజిక వర్గానివే ఉన్నాయి.

దీంతో తనకు మంచి ప్లాట్‌ఫాం ఏర్పడనుందని రాజేందర్ భావిస్తున్నారు. ఈ క్రమంలో రాజేందర్ నామినేషన్ ఉపసంహరించుకుంటారా.. లేదా బరిలో ఉంటారా అనే సందిగ్ధత నెలకొంది. నామినేషన్ ఉపసంహరించుకోకుండా కొనసాగితే మాత్రం కాంగ్రెస్ పార్టీకి నష్టం జరగడం ఖాయమని సీనియర్లు అంటున్నారు. ఇదిలా ఉండగా తాను బీసీ వాదన వినిపించేందుకు, బీసీల ఉనికిని చాటేందుకు మాత్రమే నామినేషన్ దాఖలు చేసినట్లు రాజేందర్ చెబుతూ వస్తుండడం గమనార్హం.

ఇక పార్టీ కోసం ఏళ్లతరబడి కష్టపడిన తమను కలుపుకుని ముందుకెళ్లే విషయంలో అంతగా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారంటూ కొందరు బీసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలపై గళం బలంగా వినిపించడంలో దిట్టగా ఉన్న రాజేందర్ సైతం నామినేషన్ ఉపసంహరించుకోకపోతే ఇబ్బందులు తప్పవని ఆ పార్టీ సీనియర్లు వాపోతున్నారు.

సీఎం సభలకు సర్వం సిద్ధం



నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదిక

- ఎమ్మెల్సీ కవిత ఇన్‌చార్జిగా అర్బన్, బోధన్‌లో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా
- జనసమీకరణకు కార్యాచరణ

నిజామాబాద్ నాగారం/బోధన్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జిల్లాలోని రెండు ప్రాంతాల్లో సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. మొదటగా బోధన్ పట్టణంలో నర్సాపూర్ క్రాసింగ్ సమీపంలో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభలో సీఎం ప్రసంగిస్తారు. అక్కడ సభ ముగిసిన అనంతరం నేరుగా నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మధ్యాహ్నం 1.30గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. దీనికి సంబంధించి నగరంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా దగ్గరుండి పరిశీలిస్తున్నారు. అనంతరం ఎల్లారెడ్డిలో నిర్వహించే సభలోనూ సీఎం పాల్గొననున్నారు. ఎమ్మెల్సీ కవితకు సీఎం కేసీఆర్ అర్బన్, బోధన్ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలుమార్లు పర్యటించారు. బూత్ స్థాయి ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, నాయకులతో అర్బన్‌లో ఎమ్మెల్యే బిగాలతో కలిసి సమీక్షించారు. నామినేషన్ రోజు అర్బన్ ఎమ్మెల్యే బిగాలకు విజయతిలకం దిద్ది తానే స్వయంగా కారు డ్రైవింగ్ చేస్తూ నామినేషన్ కేంద్రానికి తీసుకెళ్లారు. జిల్లాలో బుధవారం జరుగుతున్న అర్బన్, బోధన్ కేంద్రంలో జరుగనున్న బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. నగరంలోని 60 డివిజన్లలో బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి ఇన్‌చార్జీలు, సోషల్‌మీడియా ఇన్‌చార్జీల ద్వారా సీఎం సభకు జనాన్ని తరలించనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల

బందోబస్తు

జిల్లా సీపీ కల్మేశ్వర్, శాంతి భద్రతల అడిషనల్ డీసీపీ జయ్‌రాం, స్థానిక ఏసీపీ కిరణ్ కుమార్‌లు మంగళవారం జీజీ కళాశాలలో సభాస్థలిని, అలాగే బోధన్‌లో సభలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి లోపాలు జరగొద్దని ఆదేశించారు.

నేడు అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన

- మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు
- స్వతంత్రులకు గుర్తుల కేటాయింపు

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు బుధవారం ప్రకటించనున్నారు. ఇప్పటికే నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసిన విషయం తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు రెబల్స్, స్వతంత్రులు, పార్టీల అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశముంది. ఆ తర్వాత పోటీలో ఉండే అభ్యర్థులెవరో తేలనుంది. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం గుర్తులు కేటాయిస్తారు.

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 102 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. మొత్తం 128 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా, పరిశీలనలో 26 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అత్యధికంగా నిజామాబాద్ అర్బన్‌లో 23 మంది, అత్యల్పంగా బాల్కొండలో 9మంది నామినేషన్లు ఆమోదం పొందాయి.



జోరందుకోనున్న ప్రచారం..

బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. ఇప్పటికే ఆయా సామాజిక వర్గాలు, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నుంచి బరిలో నిలిచిన అభ్యర్థులను ప్రధాన పార్టీల అభ్యర్థులు బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. గుర్తులు కేటాయించిన తర్వాత గురువారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రచారం జోరందుకోనుంది. ఇదివరకే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అన్ని కుల సంఘాలతో ప్రత్యేక సమావేశాలు, సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకూ అభ్యర్థుల ప్రచారం కొనసాగనుంది.

వెబ్ క్యాస్టింగ్ తప్పనిసరి



సుభాష్‌నగర్ : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. ఎన్నికల నిర్వహణ అంశాల్లో భాగంగా మంగళవారం ఆయన ఆయా జిల్లాల కలెక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించి వెబ్ క్యాస్టింగ్, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ తదితర వాటిపై సూచనలిచ్చారు. వెబ్ క్యాస్టింగ్ కోసం సరిపడా సిబ్బందిని నియమిస్తూ, ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐ తదితర సంస్థలకు చెందిన విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని సర్ఫరాజ్ అహ్మద్ మార్గనిర్దేశం చేశారు. ఓటర్‌స్లిప్పులను ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.

రేపు డిచ్‌పల్లిలో..

- 50 వేల మందితో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన బాజిరెడ్డి



డిచ్‌పల్లి: ఈ నెల 16న డిచ్‌పల్లిలో నడిపల్లి సమీపంలోని గాంధీనగర్ వద్ద జరుగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు రూరల్ నియోజకవర్గం నుంచి 50వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీగౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే బాజిరెడ్డి సీఎం సభా స్థలాన్ని పరిశీలించారు. బుధవారం సాయంత్రంలోపు సభాస్థలిలో ఏర్పాట్లు పూర్తి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. అలాగే సభాస్థలికి కొద్ది దూరంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, నయీం, రవీందర్ తదితరులున్నాఊ.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల ఫీజుకు 21 వరకు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈ నెల 21వరకు చెల్లించవచ్చని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ మంగళవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి 1వ, 3వ, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల (2019 నుంచి డిసెంబర్ 2023 వరకు అర్హులైన విద్యార్థులకు) కు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ. వంద అపరాధ రుసుముతో ఈ నెల 22వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందని కంట్రోలర్ తెలిపారు. ఈ విషయాన్ని అన్ని అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు గమనించాలన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు..

ఖలీల్‌వాడి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు గడువును ఈ నెల 30 వరకు పెంచినట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ తుల రవీందర్ 8008403518 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన



ఖలీల్‌వాడి: ఎన్ఎస్ఎస్‌లో జాతీయస్థాయిలో గిరిరాజ్ కళాశాల డిగ్రీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రాంమోహన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్‌లో ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్–2023లో బీకాం సెకండియర్ విద్యార్థిని జె.మమత, గుజరాత్‌లోని శ్రీ గోవింద్‌గురు యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో బీకాంకు చెందిన ఎల్. శివకుమార్, శ్రీకాంత్ సాంస్కృతిక విభాగంలో ద్వితీయ బహుమతి పొందినట్లు తెలిపారు. జాతీయ స్థాయి శిబిరాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడం కళాశాలకు గర్వకారణమన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంబర్‌సింగ్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అబ్దుర్ రఫీక్, డాక్టర్ వేణుప్రసాద్, డాక్టర్ సుమలత, డాక్టర్ సతీశ్‌కుమార్, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ సునీత, డాక్టర్ రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పాఠం..

- పదో తరగతి సాంఘికశాస్త్రంలో 'ఎన్నికల ప్రక్రియ'
- విద్యార్థులకు ఓటు విలువ తెలియజేసేందుకు..
- ప్రజాస్వామ్యంపై అవగాహనకు దోహదం



పదో తరగతి సాంఘికశాస్త్రం పుస్తకంలో పొందుపర్చిన ఎన్నికల పాఠ్యాంశం

నాగిరెడ్డిపేట: వంద శాతం పోలింగ్‌కావాలంటే విద్యార్థుల పాత్ర కీలకం. విద్యార్థులకు అవగాహన కల్పిస్తే తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారితో ఓటు వేయిస్తారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో 'భారత దేశంలో ఎన్నికల ప్రక్రియ' పాఠం ముద్రితమైంది. దీంతో విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్యం, ఓటు హక్కు విలువను తెలియజేసేందుకు ఉపయోగపడుతుంది. ఈ ఎన్నికల సమయంలోనే ఈ పాఠ్యాంశం సిలబస్‌లో ఉండడం విశేషం. ఇందులో ఎన్నికల వ్యవస్థ నుంచి ఓటుహక్కు వినియోగం వరకు విద్యార్థులు సులభతరంగా అర్థం చేసుకునేలా పాఠ్యాంశంలో రూపొందించారు. ప్రజాస్వామ్యదేశంలో ఎన్నికల అవసరాన్ని గుర్తించి 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడిందని, ఇది స్వయం ప్రతిపత్తి సంస్థ అని వివరించారు. 1952లో నిర్వహించిన తొలి సార్వత్రికల ఎన్నికల్లో 17.32 కోట్లమంది ఓటర్లు ఉన్నారని, ప్రస్తుతం 67కోట్లు దాటిందని, ఎన్నికల నిర్వహణకు సివిల్ సర్వీస్‌లకు చెందినవారు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉంటారని పాఠ్యాంశంలో పేర్కొన్నారు. దీంతోపాటు దేశంలో భారీ ఎన్నికల ప్రక్రియను ఎన్నికలసంఘం సుమారు 45లక్షల మంది సిబ్బందితో నిర్వహిస్తోందని విద్యార్థులకు ఈ పాఠ్యాంశం ద్వారా తెలియజేశారు.

ఎన్నికల కమిషన్ విధులు..

ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఎన్నికల సంఘం విధులు.. గతంలో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పనిచేసిన టీఎన్ శేషన్ ప్రజల అభిమానాన్ని చూరగొన్న తీరును వివరించారు. రాజ్యాంగంలోని 15వ భాగంలోని ఆర్టికల్ 324 నుంచి 329 వరకు ఎన్నికల సంఘం నిర్మాణం, విధులను వివరించారు. ఓటర్ల జాబితాను రూపొందించడం మొదలు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ తేదీల ఖరారు, ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియామవళిని పొందుపర్చారు.

రాజకీయ పార్టీల గుర్తింపు..

రాజకీయ పార్టీ ఏవిధంగా గుర్తింపు పొందుతుంది.. ఇందుకోసం ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే అంశాలను వివరించారు. ఎన్నికల సంఘం గుర్తులను ఎలా కేటాయిస్తుంది. ఓట్లశాతం ఆధారంగా ఒక పార్టీని జాతీయ, ప్రాంతీయ పార్టీగా ఎలా గుర్తిస్తారో వివరించారు. పార్టీల ప్రచార సమయం, నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలను పాఠ్యాంశంలో పొందుపర్చారు. అభ్యర్థుల ప్రవర్తనా నియమావళికి సంబంధించి 11అంశాలను ఇందులో వివరించారు.

పోలింగ్ రోజున..

ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్‌రోజున అధికారులు, ఏజెంట్ల విధులను వివరించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి. రాజకీయపార్టీలు, ఓటర్లు ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి సహకరించడం, పోలింగ్‌రోజు ఏ అధికారి ఏ విధులు నిర్వర్తిస్తారో తెలియజేశారు.

టీఎన్ శేషన్ సిఫార్సులు

- భారత ఎన్నికల కమిషనర్‌గా 1990 నుంచి 1996 వరకు పనిచేసిన టీఎన్ శేషన్ ఎన్నికల నిర్వహణలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. వాటిని ఈ పాఠ్యాంశంలో పొందుపర్చారు.
- ఎన్నికల ప్రచార సమయాన్ని నామినేషన్ ఉపసంహరించుకునేందుకు నిర్ణయించిన తేదీ నుంచి 14 రోజులుగా నిర్ణయించారు.
- ఒక అభ్యర్థి ఒకేసారి రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి పోటీ చేయరాదు.
- ఒక వ్యక్తి ఏదైనా నేరంలో కనీసం రెండేళ్ల జైలు శిక్ష అనుభవిస్తే ఆరేళ్లపాటు పోటీకి అనర్హులు.
- పోటీలో ఉన్న అభ్యర్థి మరణిస్తే ఎన్నిక వాయిదా వేయాలి కానీ రద్దు చేయరాదు.
- ప్రచారం పూర్తయిన తర్వాత 48గంటల వరకు మద్యం అమ్మకాలు నిషేధించాలి.

బ్యాలెట్ నుంచి ఈవీఎం వరకు..



భారత ఎన్నికల సంఘం, పనితీరు తెలుసుకునే అవకాశం పదో తరగతి సాంఘికశాస్త్రంలో ఉంది. నాటి నుంచి నేటి వరకు ఎన్నికల నిర్వహణలో ఎన్నో మార్పులు జరిగాయి. మొదట బ్యాలెట్ రూపంలో ఓటు వేసేవారు, నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో ఈవీఎంలను వినియోగిస్తున్నారు. – టి.దివ్య, పదోతరగతి, గోపాల్‌పేట హైస్కూల్

ఎన్నికల విధానం గురించి..



సాంఘికశాస్త్రంలోని భారత ఎన్నికల ప్రక్రియ అనే పాఠ్యాంశంతో ఎన్నికలు జరిగే విధానం గురించి తెలుసుకున్నాను. ఎన్నికల సంఘం విధులు, నియమావళి గురించి చక్కగా వివరించారు. ఓటుహక్కును వినియోగించుకునే తీరుపై అవగాహన పొందాం. – ఉదయ్‌కిరణ్, పదోతరగతి, గోపాల్‌పేట హైస్కూల్

ఓటు విలువను తెలుసుకున్నారు



పదోతరగతి సాంఘికశాస్త్రంలో పొందుపర్చిన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ అనే పాఠ్యాంశంతో విద్యార్థులు ఓటు విలువను తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యం, ఎన్నికల సంఘం విధులు–అధికారాలు, పలు అంశాలపై వివరించారు. దీని వల్ల విద్యార్థులు భవిష్యత్ ఓటర్లుగా దేశభవిష్యత్తును నిర్మించగలుగుతారు. – శ్రీహరి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, గోపాల్‌పేట హైస్కూల్

నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: అభివృద్ధిలో నియోజకవర్గం రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉందని, ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రాష్ట్రంలో నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాకోర, జలాల్‌పూర్, సైదిపూర్, శంకోర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. తొమ్మిదిన్నర ఏళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని మరోమారు తనను గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. ప్రభుత్వం ద్వారా చేపట్టిన సంక్షేమ పథకాలు అన్నింటిని అత్యధికంగా ప్రజలకు అందించానని తెలిపారు. సాగు, తాగునీరు, విద్య, వైద్యంతో పాటు ప్రధాన రంగాలకు అధిక నిధులు మంజూరు చేయించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచామని వెల్లడించారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు గిరి, మేక వీర్రాజు, అల్తాఫ్, ఇసాక్, గోపాల్, వెంకట్ గౌడ్, కేంద్రం సాయిలు, కృష్ణారెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

స్పీకర్ వాహనం తనిఖీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని జిల్లా సరిహద్దు చెక్ పోస్టు వద్ద స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్ని మండలానికి వెళ్తున్న సమయంలో పోలీసులు వాహనాన్ని పరిశీలించారు. అనంతరం ప్రచారానికి బయలు దేరారు.



స్పీకర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రొఫెసర్ త్రివేణికి స్మారక సాహిత్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఆచార్య త్రివేణి

తెయూ(డిచ్‌పల్లి): సాహితీ వేత్త, అనువాదకులు, సామాజిక దృక్పథం కలిగిన నిజాం వెంకటేశం పేరుపై ప్రకటించిన మొదటి 'స్మారక సాహిత్య పురస్కారం'ను తెయూ తెలుగు డీన్ ప్రొఫెసర్ వంగరి త్రివేణికి ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారంతో పాటు రూ.5వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక సాహితీవేత్త, తొలి బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, ఎ గంగారెడ్డి, ఆడెపు లక్ష్మీపతి, కోడె పవన్ కుమార్, వింజమూరి సూర్య ప్రకాశ్, సీహెచ్‌వీ ప్రభాకర్‌రావు, వాడ్రేవు చినవీరభద్రం, పత్తిపాక మోహన్, చంద్రమోహన్, పలువురికి త్రివేణికి అభినందనలు తెలిపారు. నిజాం వెంకటేశం జయంతి రోజున మొదటిసారిగా ఐదుగురు సాహితీకారులకు ఈ పురస్కారాలను అందజేశారు. ఈ మేరకు త్రివేణి రాసిన 'భరిణ' (స్త్రీల సాహిత్య వ్యాససంపుటి) అనే పుస్తకానికి పురస్కారం అందజేశారు. అవార్డు గ్రహీత త్రివేణి స్పందిస్తూ.. మహోన్నత వ్యక్తి అయిన నిజాం వెంకటేశం పేరు మీద పొందిన ఈ స్మారక పురస్కారం తన రచనా వ్యాసంగంపై సామాజిక సాంస్కృతిక పరమైన నిబద్ధతను, బాధ్యతను పెంచిందని అన్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కేసులే..

- ఇప్పటిదాకా 25 కేసులు నమోదు
- సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి : ఎన్నికల కోడ్ నిబంధనలకు వ్యవహరించిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారిపై అక్టోబర్ 9 నుంచి ఈనెల 14వ తేదీ వరకు 25 కేసులు నమోదు చేశామని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఈ కేసులో మతాలను రెచ్చగొట్టే విధంగా ఉపన్యాసం, పార్టీలు, సర్వేల పేరుతో ఓటు వేయాలని అడగడం, డబ్బు పంపిణీ తదితర సంఘటనలను ఆధారంగా చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. నవీపేట్ మండలంలోని రాంపూర్ చౌరస్తాలో ఒక రాజకీయ పార్టీ కార్యవర్గ సభ్యుడు, 8 మంది అనుచరులు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడినందులకు కేసు నమోదు చేశారు. సర్వేలు నిర్వహించినందుకు బోధన్ టౌన్, బోధన్ రూరల్, నిజామాబాద్ టౌన్, ఆర్మూర్‌లలో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఓటరు సర్వే నిర్వహించగా 26మందిపై కేసు నమోదు చేశారు. బోధన్ టౌన్‌లో ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అభ్యర్థి శుక్రవారం ఓ ప్రార్థనామందిరంలో ప్రచారం చేసినందుకు కేసు నమోదు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని అలూర్ జీపీ వద్ద రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ తనిఖీ చేస్తుండగా వారి విధులకు ఆటంకపర్చినందుకు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎడపల్లి మండలం అశోక్ పార్క్, నెహ్రూనగర్‌లో ఓ రాజకీయ పార్టీ అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి డబ్బులు పంపిణీ చేయగా కేసు నమోదు చేశారు. ఇందల్‌వాయి టోల్ ప్లాజా వద్ద ఒక రాజకీయ పార్టీకి చెందిన కారు హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా, ఆ కారును తనిఖీ చేయగా ఓ పార్టీ పేరుతో బొట్టుడబ్బాలు ప్రింట్ చేయించి ఉండగా కేసు నమోదు చేశారు.

సంఘాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మోపాల్: సహకార సంఘాల అభివృద్ధిలో రైతులు భాగస్వాములు కావాలని జిల్లా సహకార అధికారి సింహాచలం అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా మోపాల్ సొసైటీ ఆవరణలో సహకార జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, ఇతర కార్యక్రమాలను వివరించారు. సహకార రంగంలో ఇటీవల అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. సొసైటీలు అందిస్తున్న అన్నిరకాల సేవలను రైతులు వినియోగించు కోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సొసైటీ సీఈవో సాయికుమార్, రైతులు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, నానుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నదిలో మృతదేహం లభ్యం

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా శివారులోని మంజీరా నదిలో ఒడ్డేడి లస్మవ్వ (65) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండల కేంద్రానికి చెందిన లస్మవ్వకు మతి స్థిమితం లేదు. ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లిన లస్మవ్వ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా మంగళవారం మంజీరాలో నదిలో మృతదేహం ఉందని తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని వెలికితీయించారు. ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయి ఉంటుందని మృతురాలి కుమారుడు బలరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీపీ ఆఫీస్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్యాయత్న చేసింది. వివరాల్లోకి వెళ్తే.. జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన వసంత భర్తపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ వ్యక్తిపై దాడి చేసిన కారణంగా హత్యాయత్నం కేసు నమోదు కాగా భర్త పరారీలో ఉన్నాడు. దీంతో పోలీసులు అతడి ఆచూకీ తెలపాలని వసంతను విచారిస్తున్నారు. మనస్తాపానికి గురైన వసంత మంగళవారం రాత్రి పోలీస్‌కమిషనర్ కార్యాలయానికి వచ్చి పురుగుల మందు సేవించింది. అప్రమత్తమైన పోలీసులు ఆమెను జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

డిచ్‌పల్లి: జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో గోవింద్ సిబ్బందికి సూచించారు. మండలంలోని నడిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావును పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, జూనియర్ అసిస్టెంట్ రజత్, బిల్‌కలెక్టర్లు సంతోష్, రాము, సిబ్బంది బాబా ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో గోవింద్

క్రైం కార్నర్

ప్రమాదంలో ఒకరి మృతి

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి శివారులో వరి కోత యంత్రం ఢీకొని బోర్గాం(పి) గ్రామానికి చెందిన కామర్స్ రాములు (55) మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సింగ్‌పల్లికి చెందిన దయానంద్ సోమవారం తన వరికోత యంత్రంతో వరి కోసేందుకు సర్వీసు రోడ్డు గుండా వెళ్తున్నాడు. ఈక్రమంలో చెట్ల కొమ్మలు అడ్డురావడంతో యంత్రాన్ని నిలిపేసి వెనుకకు తీసుకెళ్లాడు. యంత్రం వెనకాలే టీవీఎస్ ఎక్సెల్‌పై రాములు వస్తున్నాడు. ఈ విషయాన్ని గ్రహించని దయానంద్ యంత్రంతో ఢీకొన్నాడు. దీంతో రాములుకి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. రాములు అన్న కొడుకు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అనారోగ్యంతో..



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గాకు చెందిన బస్వంత్ పటేల్(30) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. బస్వంత్ పటేల్ కిడ్నీలో రాళ్ల సమస్యతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో సోమవారం రాత్రి తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి, సిర్‌పూర్, మంచిప్ప శివార్లలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరాలపై దాడులు చేసి వారిని పట్టుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి రూ.15వేల నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నందివాడలో బైక్ ధ్వంసం



తాడ్వాయి: నందివాడ గ్రామంలో బైక్ ధ్వంసమైనట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన బక్కగణేశ్ రోజు మాదిరిగానే సోమవారం రాత్రి తన బైక్‌ను ఇంటి ఎదుట నిలిపి ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి బైక్‌పై డీజిల్‌పోసి నిప్పంటించారన్నారు. దీంతో బైక్ పూర్తిగా కాలిపోయిందన్నారు. ఈ బైక్ విలువ రూ. లక్షా వరకు ఉంటుందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మహీంద్రా షోరూంలో చోరీ

- లాకర్‌ను చెత్తకుప్పలో దాచిన దొంగలు
- దొరికిన లాకర్.. డబ్బులు సేఫ్



షోరూంలో చోరీకి పాల్పడుతున్న దొంగ



లాకర్‌లో దొరికిన నగదు

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారులోని మహీంద్ర షోరూంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ చోరీ వివరాలు సీఐ కె.కృష్ణ తెలిపిన ప్రకారం.. అందరూ దీపావళి వేడుకల్లో ఉండగా ఆదివారం అర్ధరాత్రి ముఖాలకు మాస్కులు ధరించిన నలుగురు దొంగలు షోరూం వెనుకవైపు కిటీకి తొలగించి లోపలికి ప్రవేశించారు. షోరూంలోని అన్ని గదులు తిరిగి కౌంటర్‌లోఉన్న రూ.82వేలు, ఒక ట్యాబ్, సెల్‌ఫోన్ దొంగిలించారు. అనంతరం నగదు లాకర్‌ను ఎత్తుకెళ్లారు. అయితే లాకర్ వంద కేజీల బరువు ఉండటంతో దానిని దూరంగా తీసుకెళ్లలేకపోయారు. షోరూం వెనుక ఉన్న చెత్తకుప్ప కింద దాచిపెట్టి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది షోరూం మేనేజర్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే పోలీసులకు తెలిపారు. సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్ సిబ్బందితో షోరూంను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

శనివారం రాత్రి క్యాషియర్ దినేశ్ రూ.4లక్షల 80 వేల నగదును లాకర్‌లో భద్రపరిచి వెళ్లాడని ఆ లాకర్‌తోపాటు చిన్న లాకర్‌లో దాచిన రూ.82వేలు చోరీకి గురైనట్లు మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సీసీటీవీ పుటేజీలు పరిశీలించగా లాకర్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు కొద్ది సేపటికి ఖాళీ చేతులతో రోడ్డుపైకి రావడాన్ని గమనించారు. దీంతో షోరూం వెనుక ఉన్న ప్రతిఅంగుళాన్ని పరిశీలించారు. సీఐ కృష్ణ ట్రాక్టర్‌ను తెప్పించి చెత్త కుప్పను తొలగించడంతో దానికింద ఉంచిన లాకర్ బయటపడింది. అందులోని డబ్బును పోలీసుల సమక్షంలో లెక్కించగా రూ.4.80 లక్షల నగదు అలాగే ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రం ఏసీపీ కిరణ్‌కుమార్ షోరూంను సందర్శించి చోరీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హాసాకొత్తూర్‌లో భారీ కొండచిలువ

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో మంగళవారం మత్స్యకారుల వలకు పెద్ద కొండ చిలువ చిక్కింది. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన మత్స్యకారులు గ్రామ శివారులోని పాత చెరువులో చేపల కోసం వల వేశారు. మంగళవారం వలను బయటకు తీయగా అందులో 10.5 అడుగుల భారీ కొండ చిలువ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే దాంతో ప్రాణహాని ఉందని గమనించి కొట్టి చంపేశారు. చెరువులో కొండ చిలువ లభ్యం కావడంపై మత్స్యకారులు, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.



వలకు చిక్కిన కొండ చిలువ

తనిఖీల్లో నగదు పట్టివేత

భిక్కనూరు: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో ఒకరి నుంచి రూ. 70వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ మంగళవారం తెలిపారు. ఎలాంటి ఆధారాలు చూయించకపోవడంతో నగదును టాస్క్‌ఫోర్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

లక్ష్మీదేవునిపల్లిలో సైబర్ మోసం

భిక్కనూరు: మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన గుండ్రాడ్డి మౌనిక సైబర్ మోసానికి గురై రూ. 2,26,270 నగదు పోగొట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8న ఇన్‌స్టాగామ్‌లో వచ్చిన ఓ ప్రకటనకు ఆకర్షితురాలైన మౌనిక ఆ ప్రకటనలో ఇచ్చిన విధంగా వీడియో స్క్రీన్ షాట్ చేసి పంపింది. దీంతో ఆమెకు బ్యాంకు అకౌంట్‌లో సైబర్ మోసాగాళ్లు రూ. 300 ప్రోత్సాహకంగా వేస్తున్నట్లు చెప్పి ఆమె ఖాతాలో జమ చేశారు. దీంతో మౌనిక సైబర్ మోసాగాళ్లు చెప్పిన విధంగా చేస్తూ వారు చెప్పిన యూపీఐ ఐడీలకు రూ. 2,26,270 నగదును దపాల వారిగా పంపింది. తీరా వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సైబర్ క్రైం పోలీసులు వెంటనే రూ. 19,994 నగదును సైబర్ మోసాగాళ్ల ఖాతాలో జమకాకుండా ఫ్రీజ్ చేశారు. అనంతరం భిక్కనూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు సైబర్ మోసానికి గురికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు.